

కుక్కునూరు గుండేటివాగు తీరంలో పోటెత్తిన గోదావరి

పెరుగుతున్న గోదావరి

కుక్కునూరు/ పోలవరం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం తెలంగాణలోని భద్రాచలం వద్ద 40.80 అడుగుల నీటిమట్టం నమోదు కాగా సాయంత్రానికి 44.70 అడుగుల నీటిమట్టంకు చేరుకుంది. వరద 43 అడుగులు దాటడంతో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఈ క్రమంలో మండలంలోని రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేశారు. పోలవరం వద్ద శుక్రవారం సాయంత్రానికి గోదావరి నీటిమట్టం పెరిగింది.



వరదలో పెనుమాకలంక- పెద్దఎడ్లగాడి రోడ్డు

కొల్లేరును ముంచెత్తిన వరద

మండవల్లి : కొల్లేరుకు వరద నీరు ముంచెత్తడంతో నిండుకుండలా మారింది. ప్రస్తుతం పెద్దఎడ్లగాడి పెనుమాకలంక ప్రధాన రహదారిపై రెండు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 64 కాలువల నుంచి కొల్లేరుకు నీరు చేరుతోంది. ఇది ఉప్పుటేరు గుండా సముద్రంలో కలుస్తోంది. అయితే కొల్లేరు, ఉప్పుటేరు సరస్సులో భారీగా గుర్రపుడెక్క మేట వేసుకోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంగా మారింది. ఇప్పటికే పెద్దఎడ్లగాడి నుంచి పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, నందిగామలంకకు రోడ్డు మార్గాలు తెగిపోయాయి. అంతకంతకు వరద పెరుగుతుండడంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద నీటిలోనే పెనుమాకలంక గ్రామస్థులు ప్రమాదకరంగా ప్రయాణాలు చేస్తున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరుసిటీ: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా జిల్లాలో పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. శుక్రవారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మబ్బుల వాతావరణం నెలకొని ఉంది. ఈ వర్షాలు ప్రసుతం సార్వా సాగుకు అనుకూలిస్తాయని చెబుతున్నారు. జిల్లాలో సార్వా పనులు జోరుగా సాగుతున్నాయి. గత 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా ఆగిరిపల్లి మండలంలో 12.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం ఒక మిల్లీ మీటరుగా నమోదైంది. నూజివీడు 10.4, చాట్రాయి 3.2, బుట్టాయిగూడెం 1, వేలేరుపాడు 0.2 మి.మీ వర్షపాతాలు నమోదయ్యాయి.

ఎటు చూసినా.. గోతులే!



కైకలూరు నియోజకవర్గంలోని రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఎటు చూసినా చేపలు, రొయ్యల చెరువులే. వాటి మధ్యలో రహదారులు. వర్షం వస్తే పొంగుతున్న డ్రెయిన్లతో రోడ్లు మునుగుతున్నాయి. మరమ్మతులు నిర్వహించినా, నూతనంగా రహదారి నిర్మాణం చేసినా కొద్దికాలానికే అధ్వానంగా మారుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో రహదారులు అభివృద్ధికి నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో ఏడాదిగా రహదారులకు మరమ్మతులు నిర్వహిస్తున్నా కొద్దిరోజులకే యథాతథస్థితికి చేరుతున్నాయి. ఎమ్మెల్యే కామినేని అసెంబ్లీలో రోడ్ల దుస్థితిని సభ దృష్టికి తీసుకురావడంతో త్వరలో వీటికి మోక్షం కలుగుతుందని స్థానికులు భావిస్తున్నారు.

- కైకలూరు నియోజకవర్గంలో రోడ్ల దుస్థితిపై అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యే కామినేని
- చేపల చెరువులు, అధిక బరువు రవాణాతో ధ్వంసమవుతున్న రహదారులు
- త్వరలో ఆర్‌అండ్‌బీ మంత్రి పర్యటన

ఆంధ్రజ్యోతి ఫోకస్

కైకలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):కైకలూరు నియోజకవర్గంలోని రహదారుల అధ్వానస్థితిపై ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఇటీవల అసెంబ్లీలో గళమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆర్‌అండ్‌బీ మంత్రి జనార్ధన్‌రెడ్డి సహకారంతో రహదారులు అభివృద్ధి చేసినా నిత్యం 40 టన్నుల బరువు ఉన్న లారీలు తిరగడంతో రహదారులు ధ్వంసమవుతున్నాయని ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై త్వరలోనే కైకలూరులో పర్యటించి రహదారుల దుస్థితిని పరిశీలించేందుకు ఆర్‌అండ్‌బీ మంత్రి సుముఖత తెలిపారు. నియోజకవర్గంలో 70 వేల ఎకరాలకు పైబడి ఆక్వా సాగు జరుగుతున్నందున నిత్యం మేతలు, రొయ్యలు, చేపలు, మందులు వందలాది వాహనాల్లో రవాణా జరుగుతుంటాయి. అధిక బరువు, రహదారులకు ఇరువైపులా నీరు ఉండడంతో తారురోడ్లు ధ్వంసం అవుతున్నాయి. నియోజకవర్గంలోని కైకలూరు, మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో దాదాపు 80 శాతం రోడ్లు ధ్వంసమయ్యాయి. కైకలూరు మండలంలో సీతనపల్లి నుంచి ఉప్పుటేరు వెళ్లే రహదారిలో గోతులు పడ్డాయి. కొల్లేరు గ్రామాలైన పందిరిపల్లిగూడెం నుంచి గుమ్మళ్లపాడు మీదుగా శృంగవరప్పాడు వెళ్లే రహదారి ఎక్కడ ఉందో కనిపించని పరిస్థితులున్నాయి. మండవల్లి మండలం ఇంగిలిపాకలంక- పెనుమాకలంక రోడ్డు, భైరవపట్నం-తక్కెళ్ళపాడు, మూడుతాళ్ళపాడు, అనంతపురం నుంచి పులపర్రు వెళ్లే రోడ్డు పూర్తి అధ్వానస్థితికి చేరాయి. ముదినేపల్లి మండలంలో ముదినేపల్లి నుంచి మచిలీపట్నం వెళ్లే రహదారిలో గుడ్లవల్లేరు వరకు, వడాలి నుంచి చిగురుకోట, సింగరాయపాలెం నుంచి బొమ్మినంపాడు వెళ్లే రహదారులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కలిదిండి మండలంలో మూల లంక, పెదలంక, మద్ద వాని గూడెం-పెదలంక, ఆరుతెగలపాడు- కాళ్లపాలెం, కొండూరు మీదుగా తాడినాడ, పోతుమర్రు- కలిదిండి రోడ్లు గోతులు పడి అధ్వానంగా ఉన్నా యి. ఈ రహదారుల్లో కొద్ది పాటి వర్షానికే గోతులు నిండిపోయి చెరువుల్లా మారుతు న్నాయి. నీటిలో గొయ్యి కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అసెంబ్లీ సమావేశాల్లో రోడ్ల సమస్యను ఎమ్మెల్యే ప్రస్తావించడంతో త్వరితగతిన సమస్య పరిష్కారమవుతుందని నియోజక వర్గ ప్రజలు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.



కలిదిండి మండలం పోతుమర్రు-కలిదిండి ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి

కలిదిండి మండలం మూలలంక-పెదలంక ప్రధాన రహదారిపై ఇటీవల గోతుల్లో తిరగబడిన ఆటో



మండవల్లి మండలం నుచ్చుమిల్లి-పులపర్రు ఆర్‌అండ్‌బీ రహదారి దుస్థితి



చిన్నంపేటలో రహదారి దుస్థితి



మళ్లీ గోతులమయం

చాట్రాయి : ఎడతెరిపి లేని వర్షాలకు చిన్నంపేట, కోటపాడు గ్రామాల పరిధిలో ఆర్‌అండ్‌బీ రహదారి మళ్లీ గోతులమయంగా మారడంతో ప్రజలు వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. చిన్నంపేట ఎస్సీ ఏరియాలో, కోటపాడు కొత్త రామాలయం వద్ద రహదారిపై పెద్ద పెద్ద గోతులు ఏర్పడి వాహనదారులను భయపెడుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గోతులు పూడ్చి తమ ఇబ్బందులు తీర్చాలని ప్రజలు వేడుకుంటున్నారు.

● మండలంలో జనార్దనవరం- తుమ్మగూడెం రహదారిలో కొత్తచెరువు కల్వర్టుకు ఏర్పడి భారీ గొయ్యి ప్రమాదకరంగా ఉంది. ఇక్కడ ఇరువైపులా రోడ్డు ఎత్తుగా ఉండి కల్వర్టు పల్లంలో ఉండడం వల్ల దగ్గరకు వచ్చే వరకు గొయ్యి కన్పించడం లేదు. ద్విచక్ర వాహనచోదకులు గొయ్యిలో పడి గాయాల పాలవుతున్నారని, కార్లు కట్టలు విరిగిపోతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి గొయ్యిని పూడ్పించాలని ప్రజలు కోరుతున్నారు.

మద్వానిగూడెం వంతెనపై గోతులు



కలిదిండి : ఉప్పుటేరుపై ఉన్న మద్వానిగూడెం వంతెనపై గోతులు పడటంతో వాహనదారులు పలు అవస్థలు పడుతున్నారు. గోతులు పడిన ప్రదేశంలో ఇనుప చువ్వలు బయటపడ్డాయి. దీంతో వాహనాల టైర్లు పంచర్లు అవుతున్నాయని వాపోతున్నారు. నిత్యం ఈ వంతెనపై భీమవరం, విజయవాడ, హైదరాబాద్, గుడివాడ బస్సులు రాకపోకలు సాగిస్తాయి. రాత్రి వేళల్లో ద్విచక్ర వాహన చోదకులు గోతుల్లో పడి క్షతగాత్రులవుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మద్వానిగూడెం వంతెనపై గోతులను పూడ్చాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సులభతరంగా ఉచిత ఇసుక

- అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశం



ఏలూరు,సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉచిత ఇసుక విధానంలో ప్రజలకు సులభతరంగా ఇసుక అందేలా చూడాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం శుక్రవారం ఆమె అధ్యక్షతన జరిగింది. గోదావరి నదీ ప్రవాహం ఎక్కువగా ఉన్నందున జిల్లాలో పోలవరం, కుక్కునూరు మండలాల్లో నదిగర్భంలో ఉన్న ఇసుక ను వెలికి తీసే ప్రక్రియను అక్టోబరు 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. జిల్లాలో ఐదు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద 32 వేల మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉందన్నారు. వీటి సరిహద్దుల్లో ఏడు చెక్‌పోస్టులు, సీసీ కెమెరాలతో నిఘా ఉంచాలన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, మైన్స్ డిప్యూటీ డైరెక్టర్ జి.పాపారావు, ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుపై విస్తృత ప్రచారం..

జీఎస్టీ తగ్గింపు ఫలాలు జిల్లాలో ప్రతీ ఒక్కరికీ తెలిపేలా పక్కా ప్రణాళికతో విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వాణిజ్య పన్నుల శాఖ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టరేట్‌లో శుక్రవారం 'సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్' నినాదంతో ముద్రించిన కరపత్రాలను కలెక్టర్, వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్తకులతో సంప్రదించి పెద్ద ఎత్తున షాపింగ్ ఫెస్టివల్ ఏర్పాటు చేయాలన్నారు. జీఎస్టీ టాక్సు రేట్ల తగ్గింపు కారణంగా ఏ వస్తువుల ధరలు ఏ మేరకు తగ్గుతున్నాయో వివరిస్తూ ఈనెల 26 నుంచి అక్టోబరు 18 వరకు ప్రతీ మండలంలో, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అసిస్టెంట్ కమిషనర్ టి.విజయభాస్కర్, వి.శ్రీనివాసరావు, అరుణకుమారి పాల్గొన్నారు.



వరములివ్వు.. మహాలక్ష్మి

దేవీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం జంగారెడ్డిగూడెం గంగానమ్మ శ్రీమహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తుల సహకారంతో రూ.3కోట్ల నగదుతో అమ్మవారిని అలంకరించారు. మహిళలు అధిక సంఖ్యలో కుంకుమ పూజలో పాల్గొన్నారు.

- జంగారెడ్డిగూడెం

ఘనంగా కేవీఎస్ అవార్డుల ప్రదానం



ఎస్.నాగరాజన్, ఎస్.అరవింద్ సుబ్రహ్మణ్యంలకు పురస్కారాల అందజేత

ఏలూరు రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూచిపూడి నాట్యరంగంలో కళారత్న కేవీ సత్యనారాయణ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్ అన్నారు. శుక్రవారం హిందూ యువజన సంఘం, కేవీఎస్‌ట్రస్ట్, సంయుక్త ఆధ్వర్యంలో కేవీ సత్యనారాయణ జన్మదినోత్సవం పురస్కరించుకుని కేవీఎస్ అవార్డుల ప్రదానోత్సవం కనులపండుగగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. తమిళనాడుకు చెందిన ప్రముఖ ములట్టూరు మేళకళాకారులు ఎస్.నాగరాజన్, డాక్టర్ ఎస్.అరవింద్‌సుబ్రహ్మణ్యంలకు కేవీఎస్ అవార్డులను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే బడేటి చంటి, మాజీ ఉపసభాపతి, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పల నాయుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గారపాటి సీతారామాంజనేయ చౌదరి, మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ పాల్గొని వార్డులు అందజేశారు. కూచిపూడి నాట్యాన్ని విశ్వవ్యాప్తం చేస్తున్న కేవీ ప్రతి ఏడాది కళాకారులకు అవార్డులు అందించడం అభినందనీయమని వక్తలు పేర్కొన్నారు.



కూచిపూడి నృత్య ప్రదర్శన

కానిస్టేబుళ్లుగా ఎంపికైన హోంగార్డులకు సత్కారం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా హోంగార్డు విభాగంలో హోంగార్డులుగా పనిచేస్తూ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డులో కానిస్టేబుళ్లుగా ఎంపికవ్వడం ఎంతో అభినందనీయమని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. జిల్లా హోంగార్డు విభాగంలో పనిచేస్తున్న హోంగార్డులు శ్రీనివాస్ విజయ్‌కుమార్, బి.సంజయ్, కొల్లి శ్రీదేవి, ఎన్‌ఆ శ్రీనివాసరావులు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో వారిని ఎస్పీ సత్కరించారు. హోంగార్డ్సు ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్ఎస్ఐ భాస్కరరావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ నుంచి 52 సర్వీసులు : డీఎం

నూజివీడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): దసరా సెలవులను పురస్కరించుకుని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు స్వస్థలాలకు చేరుకునేందుకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసింది. నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి వివిధ ప్రాంతాలకు మొత్తం 52 సర్వీసులను ఏర్పాటు చేసినట్టు నూజివీడు ఆర్టీసీ డీఎం ధనాంజనేయులు తెలిపారు. అనంతపురం-2, కడప-2, కర్నూలు-2, శ్రీకాకుళం-10, విశాఖపట్నం-11, విజయనగరం-6, నెల్లూరు-2, తిరుపతి-3, తుని-2, ఒంగోలు-6, కాకినాడ-2, అమలాపురం-2, రాజమండ్రి-2 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేసినట్టు వివరించారు. ఇదేకాక పుణ్యక్షేత్రాలకు భక్తుల కోరిక మేరకు ప్రత్యేక సర్వీసులు నడపనున్నట్టు ఆయన తెలిపారు.



వాహనాన్ని అందుకుంటున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

పోలీస్‌శాఖకు బొలెరో వాహనం బహూకరణ

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజల రక్షణకు కార్పొరేషన్ సోషల్ రెస్పాన్సిబుల్‌లో భాగంగా ప్రజల రక్షణ కోసం ఒక వాహనాన్ని నెక్స్‌జన్ సంస్థ యాజమాన్యం సుబ్రహ్మణ్యం జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు అందజేశారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సుమారు రూ.12 లక్షల విలువైన బొలెరో వాహనాన్ని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌కు వినియోగించేలా అందించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీస్ విభాగం వేగవంతంగా ఘటనా స్థలాలకు చేరుకోవడానికి, గ్రామీణ ప్రాంతాల్లో శాంతిభద్రతలను కాపాడడానికి ఎంతో కీలకంగా మారుతుందని సుబ్రహ్మణ్యం అన్నారు. ఎస్పీ మాట్లాడుతూ నెక్స్‌జన్ యజమాని సుబ్రహ్మణ్యం అందించిన విరాళం పోలీసు శాఖకు పెద్ద గౌరవమని ఇది ప్రజల రక్షణలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యంను ఎస్పీ సత్కరించి జ్ఞాపికను అందించారు. డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర, ఏలూరు వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, జంగారెడ్డిగూడెం సీఐ ఎంవీ సుభాష్, చింతలపూడి సీఐ క్రాంతికుమార్, ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు పాల్గొన్నారు.

రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎత్నిక్ డే సంబరాలు

పెదపాడు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): సంస్కృతి, సంప్రదాయాలు మన జీవన విధానంలో ఒక భాగమని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు తెలిపారు. రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో ఎత్నిక్ డే సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. విద్యార్థులు సంప్రదాయ వస్త్ర, వేషధారణలో పాల్గొని భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని ప్రతిబింబించారు. కరస్పాండెంట్ జాస్తి మల్లికార్జునుడు మాట్లాడుతూ విద్యార్థుల్లో ఐక్యత, పరస్పర గౌరవభావాలను ఇటువంటి కార్యక్రమాలు పెంపొందిస్తాయన్నారు. రంగోలి, వంటలు, ఫ్యాషన్ పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో కొండా హరిరామకృష్ణంరాజు, ప్రిన్సిపాల్ డాక్టరు కె.వెంకటేశ్వరరావు, హెచ్‌వోడీ కేవీ శ్రీధర్, కో-ఆర్డినేటర్లు కవిత, శ్రీలాస్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం



ఆళ్వార్ గోపురాలకు రంగులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): చినతిరుమలేశుని ఆశ్వయుజమాస దివ్యబ్రహ్మోత్సవాలకు క్షేత్రంలో ఏర్పాట్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 2వ తేదీ నుంచి 9 వ తేదీ వరకు వైఖానస ఆగమ యుక్తంగా జరగనున్న ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ పరిసరాలలో ఏర్పాట్లకు దేవాలయ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ఎంతో ఎత్తైన ప్రధాన రాజగోపురం పైనా, ఆలయ ప్రాంగణములో, పాత కల్యాణమండప ప్రాంతంలో విద్యుత్ తోరణాలను, శ్రీవారు, అమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్లను ఏర్పాటు చేస్తున్నారు. ఆలయ గోపురాలకు రంగులు, విద్యుత్‌దీపతోరణాలతో సుందరీకరి స్తున్నారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు.



సచివాలయ ఉద్యోగుల ధర్నా

ఏలూరుటూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగుల దీర్ఘకాలిక సమ స్యలు పరిష్కరించాలని సచివాలయ ఉద్యోగుల సంఘం జేఏసీ డిమాండ్ చేసింది. సచివాలయ సిబ్బంది నరగపాలక సంస్థ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. యూనియన్ నాయకులు శ్రీనివాస్, కె.అబ్రహంలు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందిపై పనిభారం మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది ఒత్తిడికి గురవుతున్నారన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.



రాంబాబుకు నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేస్తున్న తహసీల్దార్

ఆమరణ నిరాహార దీక్ష విరమణ

దెందులూరు,సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గోపన్నపాలెంలో గ్రంథాలయాన్ని పునః ప్రారంభించాలని గ్రామానికి చెందిన ఏనుగు రాంబాబు చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను విరమించారు. శిబిరాన్ని తహసీల్దార్ బత్తుల సుమతి శుక్రవారం సందర్శించారు. గతంలో ఉన్న గ్రంథాలయాన్ని అదే స్థలంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ నాలుగు రోడ్ల కూడలిలోని వంగవీటి రంగా విగ్రహం వద్ద గత నాలుగు రోజులుగా రాంబాబు నిరశన దీక్ష చేపట్టారు. అయితే గతంలో గ్రంథాలయం ఉన్న స్థల వారసులు కోర్టుకు వెళ్లడంతో స్టే విధించింది. కోర్టు తీర్పు నేపథ్యంలో తహసీల్దార్ దీక్షా శిబిరాన్ని సందర్శించి రాంబాబుకు వైద్య పరీక్షలను నిర్వహింపజేశారు. గ్రంథాలయ సమస్య కోర్టు పరిధిలో ఉందని, ఆరోగ్యం క్షీణిస్తున్న నేపథ్యంలో దీక్ష విరమించాలని నచ్చజెప్పి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింప జేశారు.



తాడేపల్లిగూడెం పట్టణంలో వరిదుబ్బులతో అన్నపూర్ణాదేవిగా విశ్వదుర్గేశ్వరి అమ్మవారు.





తాడేపల్లిగూడెం వాసవీ మాతకు రూ.1.5 కోట్ల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకరణ, కాళ్లలో రూ.42 లక్షలతో మహాలక్ష్మిగా రాజరాజేశ్వరి, ఆకివీడులో రూ.60 లక్షలతో దుర్గమ్మకు మహాలక్ష్మి అలంకరణ

సిరి మహాలక్ష్మి

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వాసవీ పంచాయతన క్షేత్రంలో వాసవీ మాతకు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రూ.1.5కోట్లతో దనలక్ష్మి అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు.

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య కల్యాణ మందిరంలో రూ.60లక్షల నోట్లతో అమ్మవారిని అలంకరించారు. సుమారు నెల రోజుల నుంచి నోట్లు సేకరించామని నిర్వాహకులు ఓలేటి శ్రీను, గుర్రం ఈశ్వరరావు తెలిపారు.

కాళ్ల: శరన్నవరాత్రి వేడుకల్లో అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. దొడ్డనపూడి రాజరాజేశ్వరి దేవి అమ్మవారిని రూ.42 లక్షలతో మహాలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో సుమారు 200 మంది మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందించారు.



మహాలక్ష్మి అలంకారంలో మావుళ్లమ్మ










మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన ద్వారకాతిరుమల కుంకుళ్లమ్మ, పెనుగొండ వాసవీ మాత, ఆచంట పార్వతీదేవి, భీమవరం మెంటేవారి తోట దుర్గమ్మ, అన్నపూర్ణగా సోమేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారు, ప్రత్యేక అలంకరణలో అన్నపూర్ణాదేవి, పాలకొల్లులో ధనలక్ష్మిగా దుర్గమ్మ, వైష్ణవీ దేవిగా వాసవీ మాత

'పేదలకు భరోసాగా సీఎం సహాయనిధి'



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

పెదవేగి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేదలకు భరోసాగా సీఎం సహాయ నిధి దోహదపడుతుందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాల పార్టీ కార్యాలయంలో శుక్రవారం పలువురు తమ సమస్యలపై ఎమ్మెల్యేకు వినతులు అందించారు. కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న దొండపాడుకు చెందిన ఆదిలక్ష్మీదుర్గకు వైద్యం నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.15 లక్షలకు ఎల్‌వోసీ ఇచ్చారు. పెదపాడుకు చెందిన రామసాయికి సీఎం సహాయనిధి రూ.25 వేలను చెక్‌ను అందించారు.

టీడీపీ అభివృద్ధికి శ్రమించాలి : లక్ష్మీరమణి

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి):టీడీపీలో మండల అనుబంధ కమిటీల్లో పదవులు దక్కించుకున్న వారు పార్టీ అభివృద్ధికి శ్రమించాలని మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి అన్నారు. ద్వారకా తిరుమలకు చెందిన పలువురికి అనుబంధ కమిటీల్లో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆశీస్సులతో పదవులు దక్కాయన్నారు. వీరిలో మండల వాణిజ్యవిభాగం అధ్యక్షుడిగా మహంకాళి గంగాధరరావును, మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఉర్ల శ్రీనివాసరావును ఆమె, టీడీపీ నేత మొగతడల ఓంప్రకాష్ చౌదరితో కలిసి శ్రీవారి చిత్రపటాలు అందించి సత్కరించారు.

'సుబ్బరాయన్ సేవలు అభినందనీయం'



సుబ్బరాయన్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ మోహినీ వెంకన్నబాబు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈవోపీఆర్‌డీగా పనిచేసి పదోన్నతి పొందిన సుబ్బరాయన్ సేవలు అభినందనీయమని ఎంపీపీ బొండాడ మోహినీ వెంకన్నబాబు అన్నారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవోగా పదోన్నతి పొందిన సుబ్బరాయన్‌ను శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె వైసీపీ తూర్పు గోదావరి జిల్లా ఉపాధ్యక్షుడు బొండాడ వెంకన్నబాబుతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందించారు. ఎంపీడీవో పీవీవీ ప్రకాశ్, సిబ్బంది పాల్గొన్నారు.

బుట్టాయగూడెం సొసైటీని అభివృద్ధి చేస్తా : ఉమా



కొయ్యలగూడెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి):బుట్టాయగూడెం సొసైటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తామని సొసైటీ అధ్యక్షుడు కరాటం ఉమా అన్నారు. శుక్రవారం డీసీఎంఎస్‌లో జరిగిన సమావేశంలో ఆయనను ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, డీసీఎంఎస్ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ సన్మానించారు. సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తామని ఇద్దరు చైర్మన్‌లు హామీ ఇచ్చినట్లు తెలిపారు. తిరుమలాపురం సొసైటీ అధ్యక్షుడు బళ్లే రామచంద్రవరప్రసాద్ ఉన్నారు.

మల్లుకుంట సొసైటీ అభివృద్ధికి కృషి : సాయివినయ్



మాట్లాడుతున్న చైర్మన్ సాయివినయ్

టి.నరసాపురం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మల్లుకుంట సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్ సాయివినయ్ తెలిపారు. సొసైటీ ఆవరణలో చైర్‌పర్సన్ వినయ్ అధ్యక్షతన సొసైటీ మహాజనసభ శుక్రవా రం నిర్వహించారు. రైతుల సౌకర్యా ర్థం బొర్రంపాలెంలో ఎరువుల వ్యాపా రం, మినరల్ వాటర్ ప్లాంట్ పునఃప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. కమర్షియల్ బ్యాంకుల తరహాలోనే సొసైటీ ద్వారా బంగారంపై రుణాలు ఇవ్వడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. సొసైటీ భవనం శిథిలావస్థకు చేరడంతో నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు చేశామన్నారు. రైతుల సకాలంలో రుణాలు చెల్లించి సొసైటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సొసైటీ పర్సన్‌లు తలారి ఆంధ్రాబాబు, వెదుళ్ల వెంకటేశ్వరరావు, సీఈవో కేవీవీ.సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

డీసీసీబీని లాభాల బాట పట్టిస్తాం

» ఆప్కాబ్,డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

» ఏలూరులో డీసీఎంఎస్ మహాజన సభ



డీసీఎంఎస్ మహాజన సభలో మాట్లాడుతున్న ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

ఏలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకును రూ.100 కోట్ల పైబడి నష్టాల్లోకి నెట్టేశారు.. మేము ఇప్పటికే ఆ నష్టాలను రూ.70 కోట్లకు తగ్గించాం. 2027 నాటికి డీసీసీబీని లాభాలబాట పటిస్తామని ఆప్కాబ్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు స్పష్టం చేశారు. డీసీఎంఎస్ జిల్లా మహాజన సభ చైర్మన్ చాగంటి మురళీకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగింది. గన్ని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.1 లక్ష 40 వేల కోట్ల టర్నోవర్‌తో ఆప్కాబ్ స్వతంత్రప్రతిపత్తి కలిగిన సంస్థగా నడుస్తోందని, త్వరలో వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద మొండి బకాయిల వసూళ్లకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలో సొసైటీల కంప్యూటరీకరణ, సంస్కరణల ఫలితంగా దేశంలో ఉత్తమ ప్రతిభకు రెండో స్థానంలో సిమ్లాలో అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 13 డీసీసీబీలకు వెయ్యి కోట్లు బంగారు రుణాల అందజేతకు చర్యలు చేపట్టామన్నారు. వడ్డీ శాతం తగ్గించి సభ్యులకు రుణాలను అందిస్తామన్నారు. డీసీఎంఎస్‌కు గోడౌన్ల నిర్మాణానికి సహకరిస్తానని చెప్పారు. దీపావళి బాణసంచా అమ్మకాల ద్వారా సొసైటీలు లాభాలను ఆర్జించాలని సూచించారు. డీసీఎంఎస్ చైర్మన్ మాగంటి మురళీకృష్ణ మాట్లాడుతూ డీసీఎంఎస్ రూ.2.79 కోట్ల నికర లాభాలను సాధించిందని, ఇందులో రూ.34 లక్షల సొసైటీలకు డివిడెండ్లుగా ఇస్తామన్నారు. రాబోయే కాలంలో రూ.200 కోట్ల వ్యాపారం చేయడానికి ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. ప్రైవేట్ డీలర్లకు దీటుగా కాంప్లెక్స్ ఇతర ఎరువులను కూడా సరసమైన ధరలకు 21 బ్రాంచిల ద్వారా అందిస్తామని చెప్పారు.

వ్యాపారాలు విస్తరించాలి..

డీసీఎంఎస్ ద్వారా మండలంలో వ్యాపారాలు విస్తరించాలని, ఎరువులు ప్రైవేట్ డీలర్లు అందించే ధరలకు బ్రాంచ్‌ల ద్వారా సరఫరా చేయాలని, మిశ్రమ ఎరువులను సిద్ధంగా ఉంచాలని. త్రిసభ్య కమిటీ చైర్మన్లు తాతా సత్యనారాయణ తదితరులు కోరారు. సమావేశంలో డీసీవో ఆరిమిల్లి శ్రీనివాస్, ఏలూరు డీఆర్ సత్యవతి, ఇతర సొసైటీల చైర్మన్లు కరాటం ఉమామహేశ్వరరావు, కుటుంబశాస్త్రి, కొత్తపల్లి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం : ఎంపీ మహేశ్



విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ

ఏలూరు టూటౌన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఎంపీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. జీలుగుమిల్లి వద్ద నేవీ ఆయుధ డిపో ఏర్పాటు జిల్లాకే తలమానికం అన్నారు. దేశంలో ఎన్నో ఆయుధడిపోలున్నాయని, వాటితో ప్రజలకు ఎటువంటి ముప్పు లేదన్నారు. జిల్లా ప్రజలు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కేవలం 1166 ఎకరాల్లో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తున్నామన్నారు. భూమిని కోల్పోయే రైతులకు ఆర్‌ఆర్‌ప్యాకేజీ క్రింద పరిహారం చెల్లిస్తామన్నారు. అపోహలతో అభివృద్ధి కార్యక్రమాలకు ఎవరూ అడ్డుపడవద్దని విజ్ఞప్తి చేశారు. గిరిజనులకు విద్య, ఉపాధి, వైద్యం అవకాశాలు లభించాలనేదే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ధ్యేయమన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి చర్యలు తీసుకుంటున్నాం. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్‌బులిటీ కింద గెయిల్ ఇండియా రూ.కోటి వైద్య పరికరాలను సమకూర్చినట్లు ఎంపీ పుట్టా మహేశ్ తెలిపారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రికి రెండు అధునాతన అంబులెన్సులను కొద్ది రోజుల్లో అందిస్తానన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడారు. గెయిల్ ఇండియా జనరల్ మేనేజర్ నారాయణ, హెల్త్‌కేర్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి శరత్, డాక్టర్ ఎంఎస్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని మండల ఉద్యానశాఖ అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. మొక్కలు, ఎరువులు, యంత్రాలు సబ్సిడీపై అందిస్తుందని తెలిపారు. పట్టింపాలెంలో రైతులకు అవగాహన కల్పించారు. మండలంలో 350 హెక్టార్లు సాగు లక్ష్యం కాగా మొక్కలకు రూ.29వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.పోతన్న, వైస్ ఎంపీపీలు సూర్పన రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా చిత్రలేఖనం పోటీ విజేతలు

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ 156వ జయంతి పురస్కరించుకుని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా స్థాయిలో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన ఆన్‌లైన్ చిత్రలేఖనం పోటీల విజేతల జాబితా జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు శుక్రవారం విడుదల చేశారు. పాఠ శాల స్థాయి సబ్‌జూనియర్ విభాగంలో పి.లీలా ఆశ్య (దర్శిపర్రు) ప్రథమ, వీఎస్.చక్రధర్(యలమంచిలి) ద్వితీయ, ఏవీఎస్.స్వాగత్ (నందమూరు గరువు) తృతీయ, హేమశ్రీ (శోభనాపురం) కన్సొలేషన్ బహుమతులు సాధించారు. జూనియర్స్‌లో వి.ఆనందిత (పెదనింద్రకొలను), సీహెచ్. దీవెన (పత్తేపురం), ఎం.ఝాన్సీదేవి(భీమవరం), బి.హర్షిత(ఆకివీడు) విజేతలుగా నిలిచారు. సీనియర్స్‌లో పి.జోషిక(భీమవరం), ఎ.కావ్య శ్రావణి(తాడేపల్లిగూడెం), ఎస్ఎన్‌వీఎస్.బ్రాహ్మణి(గోపాలపురం), ఆర్.గౌరి నాగశ్రీ(కోపల్లె) బహుమతులు సాధించారు. కళాశాల స్థాయిలో పి.సాత్విక (పెదఅమిరం), ఎస్.ఎన్.శ్రీవర్ష (భీమవరం), డి.వెం కట లక్ష్మి(ఎఎస్.నగర్) విజేతలుగా నిలిచారు. అక్టోబరు 2న బహుమతులు అందజేస్తామని తెలిపారు.

వీఆర్‌కు కైకలూరు టౌన్ సీఐ

కైకలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): దానగూడెం గొడవల నేపథ్యంలో కైకలూరు టౌన్ సీఐ పి.కృష్ణను వీఆర్‌కు బదిలీ చేశారు. గురువారం రాత్రి అధికారులు బదిలీ ఉత్తర్వులను అందజేశారు. దీంతో ఆయన ఏలూరు జిల్లా ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు.



పోలీసుల అదుపులో నిందితులు, వివరాలు చెబుతున్న ఎస్పీ కిశోర్

నలుగురు దొంగలు అరెస్ట్

246 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధులపై దాడిచేసి 40 కాసుల బంగారం, రెండు కేజీల వెండిని దొంగిలించిన కేసులోని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన వందనపు లక్ష్మీకుమారి(63) ఆమె భర్త ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 23న తెల్లవారు జామున ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి కర్రలతో కొట్టి 40 కాసుల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండిని అపహరించుకుపోయారు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రవిచంద్ర పర్యవేక్షణలో సీఐలు ఎంవీ.సుభాష్, క్రాంతికుమార్, ఎస్ఐ జబీర్, ఏఎస్ఐ సంపత్‌లతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ దోపిడీకి పాల్పడిన నలుగురని అరెస్టు చేశారు. లక్కవరం గ్రామానికి చెందిన దేవర శ్రీరామమూర్తి, చెందిన షేక్ బాజీ కలిసి బాపట్ల మండలం సువర్ణపురానికి చెందిన అంగడి విల్సన్ అలియాస్ విల్సన్‌బాబు, అలియాస్ లడ్డు, గజ్జెల వాసు, కవాటి ప్రసాద్ అలియాస్ చిన్న ముఠాతో దోపిడీ చేయించారు. బాజీ పరారు కాగా మిగిలిన నలుగురు పోలీసులకు చిక్కారు. 246 గ్రాముల బంగారు ఆభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ముగిసిన అంతర్జాతీయ సాహిత్య సదస్సు



పేపర్ ఆవిష్కరణలో కళాశాల ప్రిన్సిపాల్, కరస్పాండెంట్

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో జానపద సంస్కృతి, సాహిత్యంపై రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. పలు ఖండాలు, దేశాల సంస్కృతులు, వారసత్వ సంపద, ఆచారవ్యవహారాలు, తదితర అంశాలపై విద్వాంసులు, పరిశోధకులు సమర్పించిన 120 పత్రాలపై చర్చించారు. కెనడా, అస్ట్రేలియా, మలేషియా, తదితర దేశాలతోపాటు, భారతదేశంలోని వివిధ ప్రాంతాలనుంచి 300మంది వక్తలు ఆన్‌లైన్‌లో తమ సందేశాలను పంపి, చర్చల్లో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సునీలారాణి, సిస్టర్ సుశీల, తెలుగు-హిందీ విభాగాధిపతి మహాలక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

29న నిధి ఆప్‌కే నికత్

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో ఈ నెల 29న 'నిధి ఆప్‌కే నికత్-డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రాం' నిర్వహిస్తున్నామని ప్రాంతీయ అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ రాధానాథ్ పట్నాయక్ తెలిపారు. ఈపీఎఫ్ఐ ఫిర్యాదుల నిర్వహణ వ్యవస్థ, ఇతర ఫిర్యాదుల దాఖలులో నిబంధనలు, క్లెయిమ్‌ల తిరస్కరణకు కారణాలు, ఫిర్యాదుల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్‌మెంట్లు, కొత్తగా కవర్ కాబడిన వారు తమ ఫిర్యాదులను నిధి ఆప్‌కే నికత్ అని పేర్కొంటూ సమర్పించాలన్నారు. ఏలూరు జిల్లా గోపాలపురంలో సర్వారాయ షుగర్స్ బాట్లింగ్ యూనిట్, పశ్చిమ గోదావరి జిల్లాలో పాలకొల్లు సంధ్య మెరైన్, నిధి ఆప్‌కే నిఖత్ ఉదయం 9గంటల నుంచి ప్రారంభం అవుతుందన్నారు.

అధ్యక్షా..

అసెంబ్లీ సమావేశాల్లో శుక్రవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లోని పలు సమస్యలను లేవనెత్తారు. వారేమన్నారంటే..

• వాటర్ గ్రిడ్‌కు రూ.118 కోట్లు మంజూరు



అమృత్-2 పథకంలో తణుకు పట్టణానికి గోదావరి జలాలు తరలించేందుకు గ్రిడ్ ఏర్పాటుకు ప్రభుత్వం రూ.118కోట్లు మంజూరు చేసింది. పట్టణంలో సమ్మర్ స్టోరేజీ ట్యాంకు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. 2027 నాటికి పనులు పూర్తి చేస్తామని మంత్రి చెబుతున్నారు. ఏ ప్రాతిపదికన 2027నాటికి పనులు పూర్తిచేస్తారు. మొత్తం ప్రాజెక్టు ఒకే ఏజెన్సీకి కాంట్రాక్టరు ఇస్తున్నారా లేక తణుకు పట్టణానికి చెందిన ప్రాజెక్టుని ఒక కాంట్రాక్టురుకు ఇస్తున్నారా. కొత్తగా ఎన్ని కుళాయిలు ఇవ్వబోతున్నారు. ఎన్ని కిలోమీటర్లు మేర పైపులైన్లు వేయబోతున్నారు.

- తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

అక్టోబరు 3న క్యాబినెట్‌లో ఈ అంశంపై చర్చించి నిర్ణయం తీసుకుని 2027 నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ సమాధానం ఇచ్చారు.

• అర్హులందరికి తల్లికి వందనం ఇవ్వాలి



తల్లికి వందనం అర్హులైన కొంతమందికి రాలేదు. ఆధార్‌కార్డు వివరాల్లో కొంతమందికి కరెంటు మీటర్లు రెండు మూడు ఉన్నట్లు చూపుతున్నాయి. మరికొంత మందికి రెండు, మూడు స్థలాలు ఉన్నట్లు ఆధార్‌కార్డుల్లో నమోదయ్యాయి. వాస్తవానికి వారికి కరెంటు మీటర్లు, స్థలాలు లేవు. అర్హత ఉన్నప్పటికి కొంతమంది తల్లికి వందనం పథకం రాలేదు. తప్పుగా ఎంటరైన వివరాలను సచివాలయంలో సరి చేశాం. స్టేటస్‌లో అండర్ పాసెస్ అని వస్తున్నాయి. వీటన్నిటిని సరిచేసి వచ్చే ఏడాదైనా వీరందరికి తల్లికి వందనం ఇవ్వాలి.

- ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి

• అంతర్జాతీయ విమాన సర్వీసులు ఇవ్వాలి



రాజధానికి విజయవాడ నుంచి అంతర్జాతీయ విమాన సర్వీసులు ఇవ్వాలి. విదేశాల నుంచి వచ్చే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయమైనా వారానికి ఒకటో రెండో అంతర్జాతీయ విమాన రాకపోకలు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనిపై దృష్టి పెట్టి రాజధాని నగరం నుంచి అంతర్జాతీయ విమాన రాకపోకలు జరిగేటట్లు చూడాలి. విదేశాల నుంచి వచ్చే వారు హైదరాబాద్ విమానాశ్రయం చేరుకుంటున్నారు. దుబాయ్, గల్ఫ్ నుంచి కార్మికులు హైదరాబాద్ విమానాశ్రయంలో దిగితే ఇబ్బందులు లేవు. విజయవాడలో దిగితే కస్టమ్స్ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారు.

- ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

• నాయకపోడులకు ఎస్టీ ధ్రువీకరణ ఇవ్వాలి



చింతలపూడి నియోజకవర్గం కామవరపుకోట మండలంలో 1500 మందికిపైగా నాయకపోడు కులస్తులు నివసిస్తున్నారు. 2014-2019 టీడీపీ ప్రభుత్వ హయాంలో వారికి ఎస్టీ కుల ధ్రువీకరణ ఇచ్చారు. వీరంతా టీడీపీ అభిమానులని గత వైసీపీ ప్రభుత్వంలో సర్టిఫికెట్లు ఇవ్వలేదు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్లు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు. నాయకపోడు సంప్రదాయాలు పాటిస్తున్నా విద్యలో రిజర్వేషన్ ఫలాలకు దూరమవుతున్నారు. మైదాన ప్రాంతంలో ఉన్న వీరికి ఎస్టీ సర్టిఫికెట్‌లు ఇవ్వాలి.

- చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్

• సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థి దశలో యువత సాంకేతిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సాంకేతిక విద్యను ప్రోత్సహించాలనే సదుద్దేశంతో కళాశాలలను కంపెనీలకు అనుసంధానం చేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి 1945 మంది పాలిటెక్నిక్ విద్యార్థులు పరీక్షల్లో ఉతీర్ణులయ్యారు. వారిలో 1865 మందికి ఉద్యోగాలు రావడం శుభపరిణామం. పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థుల సంఖ్య ఆశించిన స్థాయిలో ఉండడం లేదు. విద్యాశాఖ మంత్రి మాత్యులు పాలిటెక్నిక్ కళాశాలలపై దృష్టిసారించి వాటిని బలోపేతం చేయాలి. **- గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు**

తణుకు, ఏలూరు, ఆచంట, చింతలపూడి, ద్వారకాతిరుమల (ఆంధ్రజ్యోతి)

అథ్లెటిక్స్‌లో రంజనికి రజతం

ఏలూరు రూరల్, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): గుంటూరు నాగార్జున యూనివర్సిటీలో రెండు రోజుల పాటు జరిగిన 36వ సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ ఏలూరు జిల్లాకు చెందిన వి.రంజని మిడిల్ రిలే విభాగంలో రజత పథకం సాధించింది. రంజనిని జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి బి.శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.



పతకం సాధించిన రంజని

దుర్గామల్లేశ్వరస్వామి బోర్డు సభ్యురాలిగా మోరు శ్రావణి

పెదపాడు : విజయవాడ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయ పాలకమండలి సభ్యురాలిగా గుడిపాడు గ్రామానికి చెందిన బీసీ నాయకురాలు, మాజీ ఎంపీపీ మోరు శ్రావణి ఎన్నిక య్యారు. ఆలయ బోర్డు సభ్యులుగా వున్న 16 మందిలో దెందులూరు నియోజకవర్గం నుంచి ఆమె ఎంపిక య్యారు. ఆమెకు పలువురు అభినందనలు తెలిపారు.




















స్రతంపాడులో మహాలక్ష్మీదేవిగా అంబికాదేవి అమ్మవారు | రెడ్డిగణపవరంలో మహాలక్ష్మి దేవిగా అమ్మవారు | పెదపాడులో శ్రీమహాలక్ష్మిదేవి అలంకరణ | జంగారెడ్డిగూడెంలో మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు

మహాలక్ష్మి నమోస్తుతే..

- ఐదో రోజు వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు
- ఆలయాలు కిటకిట

ఏలూరుకార్పొరేషన్/ఏలూరు రూరల్, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని పలు డివిజన్లలో గల అమ్మవారి ఆలయాల వద్ద జరుగుతున్న దేవీనవరాత్రుల్లో భాగంగా ఐదో రోజు శుక్రవారం అమ్మవార్లు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. స్రతంపాడులోని అంబికాదేవి మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. నగరంలోని గంగా పార్వతీ దేవి దేవస్థానంలో ఏపీ ఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పల నాయుడు తన సతీమణి రెడ్డి అనురాధ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

● పెదపాడు/జంగారెడ్డిగూడెం/జీలుగుమిల్లి/చింతలపూడి/కొయ్యలగూడెం:పెదపాడు మండలంలోని గ్రామాల్లో గల ఆలయాల వద్ద కుంకుమార్చనలు నిర్వహించారు. జంగారెడ్డిగూడెం కోడూరి మెడోస్ వద్ద మహాలక్ష్మి అమ్మవారుగా దర్శనమిచ్చారని కోడూరి మెడోస్ చైర్మన్ కోడూరు సత్యనారాయణ రెడ్డి తెలిపారు. జీలుగుమిల్లి మండలం జీలుగుమిల్లిలో జగదాంబ అమ్మవారు మహాలక్ష్మిగా, చింతలపూడి మెరకవీధిలో అమ్మవారు శ్రీమహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. బుట్టాయగూడెంలో త్రిశక్తి పీఠం భక్తులు పీఠం నుంచి ఆంజనేయస్వామి ఆలయం వరకు అమ్మవారి కలశ ఊరేగింపును నిర్వహించారు. రెడ్డిగణపవరం విశ్వేశ్వరస్వామి ఆలయంలో వున్న కనక దుర్గమ్మ అమ్మవారు మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కొయ్యలగూడెం కనకదుర్గమ్మ అమ్మవారు మహాచం డీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేవీ ఆయుధ డిపో వద్దు

- ప్రజాప్రతినిధుల దిష్టి బొమ్మల దహనం.. ర్యాలీ

జీలుగుమిల్లి, సెప్టెంబరు 26:(ఆంధ్రజ్యోతి):నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు వ్యతిరేకంగా దాట్లవారిగూడెంలో గిరిజనులు నినాదాలు చేశారు. శుక్రవారం గ్రామంలో ఎంపీ, ఎమ్మెల్యేల దిష్టిబొమ్మలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీ పుట్టామహేశ్, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీను దిష్టిబొమ్మల్ని దహనం చేశారు. రెండు రోజుల క్రితం జీలుగుమిల్లిలో బీజేపీ నాయకులు కొందరు నేవీ ఆయుధ డిపో ఏర్పాటుతో గిరిజనులు అభివృద్ధి చెందుతారని చెప్పారని బీజేపీ నేతలకు గురువారం క్షీరాభిషేకం చేయడంతో నేతల దిష్టిబొమ్మలు తగులబెట్టామన్నారు. వంకవారిగూడెం పంచాయతీ పరిధిలో నేవీ ఆయుధ డిపో వద్దంటూ ఇప్పటికే పలుసార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లామని వారు ఆందోళనలో పేర్కొన్నారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళలకు వచ్చే దీర్ఘ కాలిక వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న రామలింగేశ్వరరావు

రామలింగేశ్వరరావు సూచించారు. శుక్రవారం జడ్పీ హైస్కూల్‌లో 'స్వస్థ్ నారీ సశక్త్ అభియాన్'లో భాగంగా మహిళలకు అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జడ్పీటీసీ పోల్నాటి బాబ్జీ, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పెనుమర్తి రామ కుమార్, టీ డీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు రావూరి కృష్ణ, పట్టణ బీజేపీ అధ్యక్షుడు తాడికొండ సుధాకర్ ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రమణ, కౌన్సిలర్ కఠారి వాసు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

































వీఆర్‌లోకి కైకలూరు టౌన్ సీఐ

కైకలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): ఈ నెల 5వ తేదీన కైకలూరు దానగూడెం గొడవల నేపథ్యంలో కైకలూరు టౌన్ సీఐ పి. కృష్ణను పోలీసు ఉన్నతాధికారులు వీఆర్‌కు బదిలీ చేశారు. గురువారం రాత్రి ఈ మేరకు బదిలీ ఉత్తర్వులను అందజేశారు. దీంతో ఆయన ఏలూరు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు.

నవోదయ ప్రవేశ గడువు పెంపు

ముదినేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరానికి జవహర్ నవోదయ పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తు గడువును ప్రభుత్వం అక్టోబరు 7 వరకు పొడిగించినట్లు ముదినేపల్లి ఎంఈవో-2 కె.నరేష్ కుమార్ తెలిపారు. 9, 11 తరగతుల్లో ఖాళీగా సీట్లను భర్తీకి గడువును పొడిగించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివి 2011 మే 1 నుంచి 2013 జూలై 31 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. 2026 ఫిబ్రవరి 7న ప్రవేశ పరీక్ష ఉంటుందని ఎంఈవో పేర్కొన్నారు.

ఆక్రమణలపై ఏడీ విచారణ

ముసునూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడులో వెటర్నరీ భవనంలో అక్రమంగా ఉంచిన టెంట్‌హౌస్ సామగ్రిని తొలగించా లని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీపై శుక్రవారం పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లింగయ్య విచారణ జరిపారు. భవనంలో సామగ్రిని పరిశీలించి అర్జీదారుతో ఏడీ మాట్లాడారు. 2013లో ఉపాధి నిధులతో గోపాలమిత్ర సిబ్బంది కోసం భవనాన్ని నిర్మించారని, అయితే నేటికీ పశుసంవర్ధక శాఖకు అప్పగించలేదన్నారు. ఇంకా ఈ భవనం పంచాయతీ రాజ్ అదీనంలోనే ఉందన్నారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అంద జేస్తామని తెలిపారు. వెటర్నరీ అసిస్టెంట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో ఏసుబాబుకు సర్పంచ్‌ల సత్కారం

ముసునూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముసునూరు నూతన ఎంపీడీవోగా బాధ్య తలు స్వీకరించిన పిల్లి ఏసుబాబును అక్కిరెడ్డిగూడెం సర్పంచ్ పులిబళ్ళ లక్ష్మీ సత్యనారాయణ, వలస పల్లి సర్పంచ్ చలసాని దామోదరరావు, చిల్లబోయినపల్లి సర్పంచ్ కండేపు రామగిరి మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. గ్రామాల అభివృద్ధికి సహకరించాలని ఎంపీడీవోను కోరారు. బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మానురాజు సురేష్, కార్యదర్శి సయ్యద్ ఒబీనా తదితరులు పాల్గొన్నారు.

రేపు వాడవల్లి పీఏసీఎస్ భవనం ప్రారంభం

ఎమ్మెల్యే, ఎంపీ తదితర ప్రముఖుల రాక



ముదినేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వాడవల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ నూతన కార్యాలయ భవనం, గిడ్డంగి ఈ నెల 28న ప్రారంభం కానున్నాయి. సుమారు రూ.37 లక్షల సంఘ నిధులతో నిర్మించిన ఈ భవనాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఎంపీ పుట్టా మహేష్ కుమార్, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్ ప్రారంభించనున్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకట రమణతోపాటు కూటమి నాయకులు, కేడీసీసీ బ్యాంక్ సీఈవో ఎ.శ్యామ్ మనోహర్, ఇతర అధికారులు పాల్గొంటారని పీఏసీఎస్ చైర్మన్ ముమ్మడిశెట్టి గోవర్ధనరావు, సీఈవో కఠారి నాగమునీంద్రరావు తెలిపారు. సంఘ వ్యాపార లావాదేవీలు సుమారు రూ.10 కోట్లకు చేరింది. 2024-25 సంవత్సరానికి నూరు శాతం రుణాలను వసూలు అయ్యాయి. సహకార బ్యాంక్ బ్రాంచి స్థాయిలో ఈ సహకార సంఘాన్ని అభివృద్ధి చేసి క్యాష్ కౌంటర్, డిపాజిట్లు సేకరణతోపాటు ఎరువుల నిల్వకు గిడ్డంగికి అనువుగా ఉండే విధంగా ఈ భవనాన్ని నిర్మించారు.

ఆక్వా చెరువులను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



మాట్లాడుతున్న అంద్రాజు శ్రీనివాస్

కలిదిండి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రాయి తీలు పొందాలంటే ఆక్వా చెరు వులను తప్పని సరిగా రిజి స్ట్రేషన్ చేయించుకోవాలని అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మట్టగుంటలో నిర్వహించిన ఆక్వా రైతుల అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఆక్వా జోన్, నాన్ ఆక్వా జోన్‌లలో సాగు చేస్తున్న ప్రతి ఆక్వా చెరువును రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ప్రతి సచివాలయంలో మత్స్యశాఖ సిబ్బందితో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ చేపడుతున్నారన్నారు. డీసీ వైస్ చైర్మన్ వీరబ్రహ్మం, రైతులు, మత్స్యశాఖాధికారులు పాల్గొన్నారు.

'మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ బాధ్యతా రాహిత్యం'

చాట్రాయి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మెడికల్ కాలే జీలను ప్రైవేటుపరం చేయటం బాధ్యతా రాహిత్యమని సీపీఐ(ఎంఎల్) లిబరే షన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరనాథ్ విమర్శించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈ విధానం వలన కార్పొరేట్లకు ప్రయోజనం జరిగి, సామాన్యు లకు భారంగా మారుతుందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించటం ఎన్టీఆర్ ఆశయాలకు తూట్లు పొడవటమే అన్నారు.

ఘనంగా చిలకమర్తి జయంతి వేడుకలు



కలిదిండి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కలిదిండి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం మహాకవి చిలకమర్తి లక్ష్మీ నరసింహం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి జె.రమేష్ బాబు మాట్లాడుతూ సామాజికంగా వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన లక్ష్మీనరసింహం గొప్ప సంఘ సంస్కర్త అని కొనియాడారు. విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	120, 129, 140
చికెన్ విత్ స్కిన్	230
చికెన్ స్కిన్‌లెస్	240
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

శివ పూజలెలా..?

» కోటపాడు ఆలయంలోకి నీరు
» పునః నిర్మాణానికి వినతి



కోటపాడులో వర్షం నీటితో నిండిన పురాతన శివాలయం

చాట్రాయి, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): కోటపాడులోని 110 ఏళ్ళ నాటి పురాతన శివాలయం వర్షం వస్తే తరచూ ముంపునకు గురవుతూ శిథిలావస్థకు చేరటంతో భక్తులు ఆవేదన చెందుతున్నారు. 1915లో ఈ గ్రామం నుంచి కాశీ వెళ్ళిన భక్తులు అక్కడి నుంచి శివలింగాన్ని తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించి నిత్యం ధూప దీప నైవేద్యాలు సమర్పిస్తున్నారు. 15 ఏళ్ళ నుంచి కుమ్మరికుంట భాస్కరరావు కుటుంబం నిత్యం స్వామికి అర్చనలు చేస్తున్నారు. కాగా ఎప్పుడో నిర్మించిన ఆలయం కావటంతో రోడ్డు, చుట్టు పక్కల ఇళ్ళు బాగా మెరక్కై ఆలయం పల్లమైంది. దీంతో వర్షం కురిస్తే ఆలయం, శివలింగం నీటిలో మునిగిపోతున్నది. ఆలయ ధూప దీప నైవేద్యాలకు నెలకు రూ. 10 వేలు మంజూరు చెయ్యాలని దేవదాయ ధర్మదాయశాఖకు దరఖాస్తు చేసినా మంజూరు కాలేదని, ఆలయానికి ఆస్తు లు, ఆదాయం లేదని, ఆలయ పునః నిర్మాణానికి, ధూప దీప నైవేద్యాలకు ప్రభుత్వం సహకారం అందించాలని పూజారి, గ్రామస్థులు కోరుతున్నారు.



మహాలక్ష్మిగా కోట మహిషమ్మ



మహాలక్ష్మిగా బలివే రాజరాజేశ్వరి అమ్మవారు



సంతోషపురంలో మహాలక్ష్మిగా దుర్గమ్మ



కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆలయంలో ఉభయదాత పూజల్లో పాల్గొన్న భక్తులు



ఆగిరిపల్లిలో పొంగలితో భక్తుల ఊరేగింపు

మహాలక్ష్మి.. కరుణించ రావా..

కైకలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): శ్రీశ్యామలాంబ అమ్మవారి శ్రీచండీమహాయాగ సహిత దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో శుక్రవారం అమ్మవారు శ్రీధనలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు పెద్దఎత్తున క్యూలైన్లో నిల బడి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి పుష్పాలంకరణ పిచ్చికల సూర్యనారాయణ, రాణి దంప తులు చేయించగా భక్తులకు ఉచిత ప్రసాదాన్ని దాతలు బచ్చు మురళీ, వరదా వెంకట శివరామకృష్ణ కిషోర్, కంచర్ల రామకృష్ణ, చిట్టూరి రమేష్, నాగన బోయిన నాంచారయ్య అందజేశారు. ఉభయదాతల పూజల్లో 104 మంది, చండీహోమం పూజల్లో 26 మంది దంపతులు పాల్గొని పూజలను నిర్వహించారు. దంపతులను ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు శేషవస్త్రాలతో సత్కరించారు. సాయంత్రం మురళీ కోలాట ప్రదర్శన, హరికథగానం, కలిదిండి బాబూరావు సమర్పణలో రామాంజనేయ యుద్ధం, హరిశ్చంద్రనాటకం, గోయోపాఖ్యానంలోని కొన్ని ఘట్టా లు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఉత్స వ కమి టీ సభ్యులు, ఆలయ ఈవో వీఎన్‌కె శేఖర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం శ్రీశ్యామలాంబ అమ్మవారు లలితాత్రిపుర సుందరి అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

●కొల్లేటికోట శ్రీపెద్దింటమ్మ ఆలయంలో అమ్మ వారికి గులాబి పుష్పార్చన, లలితా సహస్ర కుంకుమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఉభయదాతల పూజలు కైక లూరుకు చెందిన కొత్తపల్లి నాగదార లక్ష్మీతేజవర్మ దంపతులు ఆలయ ప్రధాన అర్చకులు పరమేశ్వరశర్మ ఆధ్వర్యంలో జరిపారు. ఆలయ అధికారి కూచిపూడి శ్రీనివాసు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముదినేపల్లి: దేవపూడి రామలింగేశ్వరస్వామి ఆలయంలో దుర్గాదేవి శ్రీ లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమివ్వగా, సర్పంచ్ దాసరి కాశీ అన్నపూర్ణ దంపతులు తదితరులు పూజలు నిర్వ హించారు. ఆలయ చైర్మన్ దాసరి భగవాన్ దాస్ పర్యవేక్షణలో అర్చకుడు జగదీశ్వర మణికంఠ పూజలు జరిపారు. పెయ్యేరు కనకదుర్గా నగర్‌లోని దుర్గమ్మ ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. పెయ్యేరు ఉప సర్పంచ్ దివి సతీష్ దంపతులు పూజ లు జరిపారు. గురజ రామలింగేశ్వరస్వామి ఆల యంలో నిర్వాహకుడు వీరిశెట్టి కొండలరావు ఆధ్వర్యం లో పార్వతీ దేవికి భక్తులు పూజలు జరిపారు.

●ముదినేపల్లిలోని సహాయ మాతా ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో దసరా వేడుకలు జరిగాయి. స్కూలు కరస్పాండెంట్ క్రిస్టీ, ప్రిన్సిపాల్ లిన్సా ఆధ్వర్యంలో విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శన లు నిర్వహించారు. అమ్మవారి అలంకరణలతో విద్యార్థినులు అలరించారు.

కలిదిండి: మండలంలోని పెదలంక, మూల్లంక, సంతోషపురం తదితర గ్రామాల్లో శుక్రవారం దుర్గమ్మ ను మహాలక్ష్మిగా అలంకరించారు. మహిళలు అమ్మ వారికి కుంకుమ పూజలు చేయగా భవాని మాల దారులు భజనలు నిర్వహించారు.

నూజివీడు టౌన్: నూజివీడు కోట మహిషాసుర మర్దిని అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మిగా భక్తులకు సాక్షాత్కరించారు. శుక్రవారం కలసి రావడంతో భక్తులు విశేష సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక కుంకుమార్చన, పూజా కార్యక్రమాలను దేవదాయ ధర్మదాయశాఖ ఈవో అలివేణిశ్రీ, ప్రధానార్చకులు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు.

ముసునూరు: బలివే రాజరాజేశ్వరి శుక్రవారం శ్రీ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ అర్చకులు అమరబాబు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని సాముహిక కుంకమ పూజలు చేశారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి యాదవ బజార్ మండపం లో ప్రతిష్ఠించిన దుర్గమ్మను శుక్రవారం మహాలక్ష్మిగా అలంకరించి పూజలు చేశారు. మహిళలు పాల పొంగ ళ్లను తలపై పెట్టుకుని ఊరేగింపుగా వెళ్ళి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. స్థానిక రుద్రభూమి దుర్గమ్మ ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు.

చాట్రాయి: శరన్నవరాత్రి మహోత్సవాల ఐదో రోజు దుర్గ మ్మ మహాలక్ష్మిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. చాట్రాయి, ఆరుగొలనుపేట, జనార్దనవరం, చనుబండ, బూరుగుగూడెం, మర్లపాలెం తదితర గ్రామాల్లోని అమ్మవారి పందిళ్ళలో భక్తులు సందడి కన్పించింది.



ముదినేపల్లి సహాయ మాతా పాఠశాలలో అమ్మవార్ల అలంకరణలో విద్యార్థులు



ఆరుగొలనుపేటలో మహాలక్ష్మి అలంకరణ

సస్యరక్షణ చర్యలతో లాభాల పంట

ముసునూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు తమ పంటలకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ఏ.చాముండేశ్వరి అన్నారు. శుక్రవారం చింతలవల్లిలో పొలం పిలుస్తోందిలో భాగంగా వరిలో సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. మిత్ర, శత్రు పురుగుల గుర్తింపుపై అవగాహన కల్పించారు. మిత్ర పురుగుల నిష్పత్తి ఎక్కువగా ఉన్నప్పుడు పురుగుమందులను పిచికారి చేయరాదని ఏవో వివరించారు. వీఏఏ శివ, రైతులు పాల్గొన్నారు.



వాగులో లారీ బోల్తా

డ్రైవర్ సురక్షితం

ఆగిరిపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అదుపుతప్పి లారీ వాగులో బోల్తాపడిన ఘటన మండల పరిధిలోని శోభనాపురం రోడ్డులో ఎత్తిపోతల పథకం వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు, వాహనదారుల వివరాల మేరకు రోడ్డు పనుల కోసం కొండపల్లి నుంచి చిప్స్ లోడుతో ఈదులగూడెం వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలను తప్పించబోయి, అదుపుతప్పి వాగులో బోల్తాపడింది. డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు.

ఔషధ మొక్కలతో జీవనోపాధి



ఔషద మొక్కలు అందజేస్తున్న చంద్రశేఖర్

ఆగిరిపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్ర జ్యోతి): ఔషధ మొక్కలతో ఆరోగ్యంతో పాటు జీవనోపాధి కూడా పొందవచ్చని రాష్ట్ర మెడిసినల్, ఆరోమేటిక్ ప్లాంట్స్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ పి.చంద్ర శేఖర్ అన్నారు. పోతవర ప్పాడులోని గాడ్సన్ సోషల్ సర్వీస్ సొసైటీ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన 'ఔషధ మొక్కల పెంపకం - ప్రజా భాగస్వామ్యం- జీవనోపాధి అవకాశాలు'పై ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఔషధ మొక్కల పెంపకంలో స్థానిక ప్రజలను, రైతులను, స్వశక్తి సంఘాలను భాగ స్వాములను చేయడం సదస్సు ముఖ్య ఉద్దేశమన్నారు. డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.ప్రదీప్‌కుమార్ ప్రసంగించారు. గాడ్సన్ సొసైటీ డైరెక్టర్ కోలేటి పాల్ రమేష్, మెడిసినల్ ప్లాంట్స్ కన్సల్టెంట్ ఎం.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

నలుగురు దొంగల అరెస్ట్

246 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం

ఏలూరు క్రైం, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంటరి వృద్ధులపై దాడి చేసి 40 కాసుల బంగారం, రెండు కేజీల వెండిని దొంగిలించిన కేసులోని నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను తెలిపారు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన వందనపు లక్ష్మీకుమారి(63) ఆమె భర్త ఇంట్లో నిద్రిస్తుండగా ఈనెల 23న తెల్లవారు జామున ముగ్గురు వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి కర్రలతో కొట్టి 40 కాసుల బంగారు ఆభరణాలు, 2 కేజీల వెండిని అపహరించారు. లక్కవరం పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ రవిచంద్ర పర్యవేక్షణలో సీఐ లు సుభాష్, క్రాంతికుమార్, ఎస్ఐ జబీర్, ఏఎస్ఐ సంపత్‌లతో ప్రత్యేక బృందం దర్యాప్తు చేపట్టింది. ఈ దోపిడీకి పాల్పడిన నలుగురని అరెస్టు చేశారు. లక్కవరం గ్రామానికి చెందిన దేవర శ్రీరామమూర్తి, చెందిన షేక్ బాజీ కలిసి బాపట్ల మండలం సువర్ణపురానికి చెందిన అంగడి విల్సన్ అలియాస్ విల్సన్‌బాబు, గజ్జెల వాసు, కవాటి ప్రసాద్ అలియాస్ చిన్న ముఠాతో దోపిడీ చేయించారు. బాజీ పరారు కాగా మిగిలిన నలుగురు పోలీసులకు చిక్కారు. 246 గ్రాముల బంగారు ఆభరణాలు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బైక్‌లు ఢీ.. ఒకరి మృతి

కైకలూరు, సెప్టెంబరు 26(ఆంధ్రజ్యోతి): పామర్రు-దిగమర్రు 165వ జాతీయ రహదారిలో కైకలూరు మండలం ఆలపాడు వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా ముగ్గురికి తీవ్ర గాయాలైన ఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. కైకలూరు రూరల్ పోలీసుల వివరాల ప్రకారం కైకలూరుకు చెందిన గొట్టుముక్కల నరసింహరాజు ఆకివీడు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా మండలంలోని ఆలపాడు శివారు ఆదర్శ స్కూల్ వద్ద ఎదురుగా ఒకే బైక్‌పై ముగ్గురు వ్యక్తులు వచ్చి ఢీకొట్టారు. దీంతో ముగ్గురికి తీవ్రగాయాలు కాగా బైక్‌పై ముగ్గురిలో వెనుక కుర్చున్న ఉయ్యూరు మండలం గొల్లపాడు గ్రామానికి చెందిన కె. దామోదరరావు(51) అక్కడి కక్కడే మృతి చెందాడు. గాయపడిన ముగ్గురిని స్థానికులు కైకలూరులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గాయపడ్డ నరసింహరాజు ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు. బైక్‌పై వస్తున్న ముగ్గురిలో మరో ఇద్దరు గుడివాడకు చెందిన ఎస్ సుబ్బరాజు, ఎస్. జోజిబాబుగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

సూరేపల్లిలో హుండీల చోరీ

ముసునూరు, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరేపల్లి గ్రామంలో రెండు ఆలయాలు, చర్చితోపాటు ఒక ఇంటిలో గురువారం రాత్రి చోరీలు జరిగాయి. మెయిన్ సెంటర్‌లో ఉన్న శ్రీ అంజనేయ స్వామి ఆలయంలో హుండీని, ఎన్ఎస్పీ కాలువగట్టు పక్కన ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ హుండీని, రజకుల పేట చర్చిలో రూ.2 వేల నగదు, భట్టు గోపి ఇంటిలో ఉన్న ద్విచక్ర వాహనాన్ని దుండగులు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం ముసునూరు ఏఎస్ఐ బేగ్, సిబ్బంది క్లూస్ టీమ్‌ను రప్పించి అధారాలు సేకరించారు.

ఆస్తి కోసం అన్నపై దాడి

ముదినేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పేరూరు గ్రామానికి చెందిన పుట్టి వీరనారాయణకు కొంత భూమి ఉంది. అందులో కొంత భాగం రాసివ్వమని 2024 నవంబరు 18న అతని చెల్లెలు చుక్కమ్మతో పాటు ఆమె బంధువులు డిమాండ్ చేయగా అందుకు వీరనారాయణ అంగీకరించకపోవడంతో చుక్కమ్మ, ఆమె బంధువులు వీరనారాయణపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడు కోర్టులో ఫిర్యాదు చేయగా కోర్టు ఆదేశాలపై శుక్రవారం కేసు నమోదు చేసి ముదినేపల్లి స్టేషన్ హెచ్‌సీ రామారావు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహితను వేధిస్తున్న కేసు

ముదినేపల్లి, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం చేవూరు గ్రామానికి చెందిన వివాహితపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు వేధిస్తున్న ఘటనపై శుక్రవారం పోలీసులు కేసు నమోదు చేశారు. గ్రామానికి చెందిన తంటేపూడి రాకేష్, బొడ్డు పృథ్వీరాజ్ నెల రోజులుగా ఆమె వెంట పడుతూ తమ కోర్కె తీర్చమని వేధిస్తున్నారు. బాధితురాలు విషయాన్ని తన భర్త, అత్తింటివారికి చెప్పగా ఈ నెల 25న వారు రాకేష్ ఇంటికి వెళ్ళి నిలదీయగా రాకేష్‌తో పాటు పృథ్వీరాజ్ వారిపై దాడి చేశారు. శుక్ర వారం బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.